## ఆలయాల్లో చోరీలు

కాగజ్‌నగర్, మే 3: కాగజ్‌నగర్‌లోని కాపువాడతో పాటు మండలంలోని భట్‌పల్లిలోని అభయాంజనే స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. మండలంలోని భట్‌పల్లి హనుమాన్ ఆలయంలో వెండి సామగ్రితో పాటు విలువైన సామగ్రి చోరీ కాగా, కాగజ్‌నగర్‌లోని కాపువాడలో పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం గర్భగుడిలోని స్వామి వారి మెడలో 54 ఆకుల వెండి మాలలు, విలువైన వస్తువులు చోరీ జరిగినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. కాగజ్‌నగర్ రూరల్ పోలీసు స్టేషన్‌లో, కాగజ్‌నగర్ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు అర్చకులు తెలిపారు.

**బోర్లకుంటలో హనుమాన్ ఆలయంలో..**



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రాజు

దహెగాం,మే 3: మండలంలోని బోర్లకుంట గ్రామంలోని హనుమాన్ గుడిలో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్ఐ కందూరి రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం అర్చకుడు గోలాల సరేందర్ చారి ఆలయానికి వెళ్లాడు. అప్పటికే తాళం పగుల గొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించాడు. 15 తులాల వెండి కిరీటం,1 గ్రాము బంగారు సీతమ్మవారి పుస్తెలు చోరీకి గురైనట్లు గ్రామస్తులు, అర్చకుడు తెలిపారు. క్లూస్ టీమ్‌ను కూడా రప్పించి ఫింగర్ ప్రింట్స్ తీసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## ఆటో బోల్తా-ముగ్గురికి గాయాలు

సిర్పూర్(యూ), మే 3 : ఆటో బోల్తా పడ్డ ప్రమాదంలో ముగ్గురికి గాయలైన ఘటన శనివారం పెద్దదోభలో జరిగింది. ఎస్ఐ రామకృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెద్దదోభ సమీపంలో ఆటో డ్రైవరు ఆత్రం భీంరావు నిర్లక్ష్యంగా నడపడంతో బోల్తా పడింది. ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు.

## ఇరువురిపై కేసు నమోదు

కాగజ్‌నగర్, మే 3: కాగజ్‌నగర్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో చిన్న ప్రమాద విషయంలో జరిగిన గొడవలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్ఐ సుధాకర్ శనివారం తెలిపారు. మహమ్మద్ తౌఫిక్, అబ్దుల్ సమీర్‌పై కేసు నమోదు చేయగా మరో వర్గమైన దీపక్ కుమార్ యాదవ్, చందుపట్ల సాయికిరణ్, పాయం కమారస్వామిపై కేసు నమోదు చేసినట్లు స్పష్టం చేశారు. అనంతరం ఐదుగురు వ్యక్తులకు రూ.2 లక్షల సొంత పూచికత్తు, సత్ప్రవర్తనపై తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు చెప్పారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
FINANCIAL SERVICES
★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.
NT-336491-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## రైతులకు ఇబ్బంది కలిగించవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ దత్తుమూర్తి,నాయకులు

తాండూర్, మే 3 : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బంది కలిగించకుండా పీఏసీఎస్ అధికారులు, సిబ్బంది, నిర్వాహకులు అన్ని సౌకర్యాలు కల్పించాలని సింగిల్ విండో చైర్మన్ సుబ్బ దత్తుమూర్తి అన్నారు. శనివారం మండలంలోని రేచిని గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరం రవీందర్‌రెడ్డి, ఎండీ ఈసా, సిరంగి శంకర్, సాలిగామ బానయ్య, మొగిలి శంకర్, సింగిల్‌విండో డైరెక్టర్లు మాసాడి తిరుపతి, కేశెట్టి సంతోష్, పులుగం తిరుపతి, దేవరకొండ రాజయ్య, ఏఈవో శంకర్, సీఈవో శ్రీనివాస్, సిబ్బంది అనిల్, వెంకటేశ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

చెన్నూర్ రూరల్, మే 3: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు వేగవంతం చేయాలని చెన్నూర్ మాజీ ఎంపీపీ మంత్రి బాపు తెలిపారు. ఇటీవలే కురిసిన వర్షాలకు పలువురు రైతులకు చెందిన ధాన్యం తడసిపోయిందని, ఎలాంటి నిబంధనలు పెట్టకుండా ధాన్యం కొనుగోలు వెంటనే చేపట్టాలని కోరారు. తడిసిన ధాన్యానికి తూకంలో కటింగ్ పేరుతో రైతులకు ఇబ్బందులకు గురి చేస్తే నిర్వాహకుల మీద జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## కుటుంబసభ్యుల వద్దకు మతిస్థిమితం లేని మహిళ

తాండూర్, మే 3 : మతిస్థిమితం లేని మహిళను పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ డీ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మూడు రోజులుగా మతిస్థిమితం లేని మహిళ తాండూరు మండల పరిధిలో తిరుగుతుండగా ఎవరైనా గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసులు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేశారు. తాండూరుకు చెందిన ఇందారపు శ్రీనివాస్, రజిత ఆ మహిళను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఆమె తమ బంధువేనని, లక్షెట్టిపేట్ మండల కేంద్రం బాబు రావు కాలనీకి చెందిన తిరునగర్ సందీప్ భార్య గంగ అని తెలిపారు. దీంతో ఆమెను వారి బంధువులకు అప్పగించారు.

## నిషేధిత ప్రదేశంలో రోడ్డును దాటొద్దు

మందమర్రి, మే 3: మందమర్రి పట్టణంలో నిర్మించిన నాలుగు వరుసల జాతీయ రహదారి 363ను నిషేధిత ప్రదేశంలో దాటడం ప్రమాదకరమని మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి అన్నారు. స్థానిక సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట గల పార్కులో శనివారం ఏర్పాటు చేసిన యాపల్ ఏరియా ప్రజలకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. యాపల్ ఏరియాలో నాలుగు వరుసల జాతీయ రహదారిని నిషేధిత ప్రదేశంలో దాటుతూ ప్రమాదానికి గురై ఇప్పటి వరకు ఆరుగురు వ్యక్తులు తమ ప్రాణాలను కోల్పోయారని అన్నారు. జాతీయ రహదారుల సంస్థ రోడ్డును దాటడానికి కొన్ని ప్రదేశాలను ఏర్పాటు చేసిందని ఆ ప్రదేశాల్లోనే రోడ్డును దాటాలని సూచించారు. యాపల్ ఏరియా ప్రజలు బస్సుల ద్వారా ప్రయాణించేందుకు ఏర్పాటు చేసిన బస్ షెల్టర్లు రోడ్డును దాటే ప్రదేశాలు దూరంగా ఉన్న విషయం వాస్తవమేనని అందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కొరకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితిలో రోడ్డును దాటాల్సి వస్తే వాహనాల రాకపోకలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎండి.అబ్బాస్, కాలనీ వాసులు సంతోశ్, డాక్టర్ సాంబమూర్తి, వనం నర్సయ్య, వెంకట్ రెడ్డి, కోమశెట్టి తిరుపతి, నోముల శ్రీధర్, రాచర్ల రవి, అఖిలేశ్ పాండే, డాక్టర్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

నస్పూర్, మే 3 : రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, మీ సేవ ద్వారా అందిన దరఖాస్తుల వివరాలను పరిశీలించి అర్హులైన వారికి రేషన్ కార్డులు జారీ చేస్తామని మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులపై సమగ్ర విచారణ చేసి జిల్లాలో 956 నూతన రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. రేషన్ కార్డుల్లో పిల్లలను చేర్పించడం, ఇతర మార్పులకు సంబంధించి 29,237 దరఖాస్తులు విచారించి ఆమోదించినట్లు తెలిపారు.

## వాకింగ్ ట్రాక్‌ను చెక్క పొట్టు, మట్టితో నిర్మించాలి

మందమర్రి, మే 3: మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్‌ను చెక్క పొట్టులో మట్టిని కలిపి నిర్మించాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు శనివారం పాఠశాల మైదానంలో సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఓ.రాజశేఖర్, రాజేశం, గురుప్రసాద్‌లు మాట్లాడుతూ వాకింగ్ ట్రాక్‌ను పూర్తిగా మట్టితో నిర్మించడం వలన భవిష్యత్‌లో కాళ్లకు సంబంధించి అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఏరియా జీఎం స్పందించి మైదానంలో సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## మున్సిపల్ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు

మంచిర్యాలటౌన్, మే 3: జిల్లాలో పనిచేస్తున్న పలువురు మున్సిపల్ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు లభించాయి. మంచిర్యాల మున్సిపాలిటీలో శానిటరీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న రాజమనోహర్, మున్సిపల్ మేనేజర్‌గా పనిచేస్తున్న కే విజయ్‌కుమార్, మందమర్రిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శ్యాంసుందర్‌కు థర్డ్‌గ్రేడ్ కమిషనర్లుగా ఉద్యోగోన్నతులు వచ్చాయి. మంచిర్యాల కార్పొరేషన్‌లో పనిచేస్తూ ఉద్యోగోన్నతులు పొందిన రాజమనోహర్, కే విజయ్‌కుమార్‌ను శనివారం కమిషనర్ తౌటం శివాజీ, కార్పొరేషన్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

## పాఠశాలలో సమ్మర్ క్యాంపు ప్రారంభం

వేమనపల్లి, మే 3 : నీల్వాయిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపును ఎంపీడీవో కుమారస్వామి, ఎంఈవో శ్రీధర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సంతోష్‌కుమార్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ క్యాంపులో యోగా, ఆటలు, డ్రాయింగ్, పెయింటింగ్, ఇంగ్లిష్ గ్రామర్ తదితర వాటిలో శిక్షణ ఇస్తామని తెలిపారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నీల్వాయి పాఠశాలలో 500లకు పైగా మార్కులను సాధించిన 12 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గిరిధర్‌రెడ్డి, నాయకులు సాబీర్ అలీ, గాలి మధు, సమ్మయ్య, పున్నం, మధుసూదన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మల్లేశ్, అలీ, వెంకటేశ్, రాజాబాబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**క్రీడా పోటీలు ప్రారంభం..**నీల్వాయి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఖోఖో, క్యారం, చెస్ సమ్మర్‌క్యాంపు పోటీలను శనివారం ఎంపీడీవో కుమారస్వామి, ఎంఈవో శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు మల్లేశ్ భీమ్‌రావు పాల్గొన్నారు.

## పిల్లలో ఆత్మ విశ్వాసాన్ని నింపాలి

హాజీపూర్, మే 3 : మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వేసవి కాలంలోని నిర్వహించే ఉచిత శిక్షణ తరగతుల వలంటీర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 5వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు ఉచిత వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తామని మండల విద్యాధికారి (ఎంఈవో) తిరుపతి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముల్కల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం బొమ్మ గణపతి రెడ్డి, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

దండేపల్లి, మే 3: జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని వెల్గనూర్ కాంప్లెక్స్ హెచ్ఎం విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు వజ్ర, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

# అన్నింటికన్నా ఉన్నతమైనది చదువు

- ఏఎస్పీ చిత్త రంజన్
- గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభించి పుస్తకాలను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ చిత్తరంజన్

తిర్యాణి, ఏప్రిల్ 3: అన్నింటికన్న ఉన్నతమైనది చదువేనని అదనపు ఎస్పీ చిత్తరంజన్ అన్నారు. పోలీసులు మీకోసంలో భాగంగా తిర్యాణి పోలీసుల ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని స్థానిక పాత పోలీసు స్టేషన్ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన గ్రథాలయ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక యువత చేత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న పేద యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉండేందుకు, ఉన్నత చదువులు అభ్యసించేందుకు, పోటీపరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఉద్యోగావకాశాల్లో మెరుగుపడేందుకు పోలీసు స్టేషన్‌ను గ్రంథాలయంగా మార్చినట్లు తెలిపారు. దీని ద్వారా యువత నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. సమాజంలో యువత చెడును విడనాడి మంచిని ఎంచుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. జీవితంలో చీకట్లను పారద్రోలే శక్తి కేవలం చదువుకు మాత్రమే ఉందన్నారు. ఒక వ్యక్తికి ఉద్యోగం వస్తే ఆ కుటుంబమే అభివృద్ధి చెందుతుందన్నారు. ఒకప్పుడు బాంబుల నిలయంగా ఉన్న పోలీసు స్టేషన్‌ను నేడు విజ్ఞాన బండారంగా మార్చినట్లు తెలిపారు. ఈ గ్రంథాలయంలో 200 రకాల ఆయా పుస్తకాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మరిన్ని కొత్త పుస్తకాలను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. పట్టుదలతో చదివి యువత ఉద్యోగాలు సాధించాలని సూచించారు. ప్రజలు, పోలీసులకు మధ్య నున్న దూరాన్ని తగ్గించేందుకే సామాజిక కోణంలో దృష్టి సారించి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రంథాలయం ఏర్పాటుకు ప్రత్యేక కృషి చేసిన తిర్యాణి ఎస్ఐ శ్రీకాంత్‌ను అభినందించారు. ఈ సమావేశంలో రెబ్బన సీఐ బుద్దే స్వామి, ఎస్ఐ శ్రీకాంత్, ఆయా ఆదివాసీ సంఘాల నాయకులు, విద్యార్థులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల స్వీకరణ

నస్పూర్, మే 3 : విద్యా సంవత్సరంలో శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థ హైదరాబాద్‌లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన, నిరుపేద కుటుంబాలకు చెందిన ఇతర బాధిత బాలికలు సీసీఐలో నివసిస్తున్న బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 17లోగా జిల్లా కేంద్రంలోని జిల్లా బాలల సంరక్షణ విభాగం బాల రక్ష భవనంలో సంప్రదించాలని, వివరాలకు 9908541697, 9441506519లో సంప్రదించాలని సూచించారు.

## కన్నాలబస్తీలో అగ్ని ప్రమాదం

బెల్లంపల్లి, మే 3: పట్టణంలోని కన్నాలబస్తీలోని నిక్కొండ వెంకటేశ్ ఇంట్లో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. ఇంటి పూజ గదిలో దీపాలు వెలిగించి కుటుంబ సభ్యులు బయటికి వెళ్లారు. దీపాలు కిందపడి పక్కనే ఉన్న వస్తువులకు అంటుకుని మంటలు చెలరేగాయి. గమనించిన పక్కింటి వారు తలుపులు పగుల కొట్టి బోరునీటి ద్వారా మంటలార్పేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఫర్నీచర్, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతయయ్యాయి. ఫైర్ సిబ్బంది శ్రీనివాస్, అశ్వత్, నారాయణ, మహేశ్ పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

మందమర్రిరూరల్ , మే 3 : మండల పరిధిలోని ఆదిల్‌పేట్‌కు చెందిన ఆకుల శ్రీనుకు చెందిన ఆవు ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం పొన్నారంలో తెగి పడి ఉన్న విద్యుత్ తీగకు ఆవు తగలడంతో మృతి చెందిందని తెలిపాడు. ఆవు విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని నష్టపరిహారం అందించాలని కోరాడు.

## యువతి అదృశ్యం

మంచిర్యాల అర్బన్, మే 3: మంచిర్యాల ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన వానరాసి ఎలీషా (19) అదృశ్యమైనట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ శనివారం తెలిపారు. వానరాసి ఎల్లమ్మ కూతురు ఎలీషా శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులందరితో కలిసి భోజనం చేసి పడుకున్నది. ఉదయం లేచి చూసే సరికి మేడపై పడుకున్న తన కూతురు కనిపించలేదని తల్లి ఎల్లమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంచిర్యాల అర్బన్, మే 3:మంచిర్యాల ప్రభుత్వ జనరల్ దవాఖానలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు మంచిర్యాల పట్టణ కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం వారు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల గౌతమీనగర్ రామాలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో ఉన్నారని 108కు సమాచారం రాగా దవాఖానకు తీసుకువచ్చి చేర్పించారు. కిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పేరొన్నారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలు తెలిస్తే సెల్ నం. 8712656534, 8712656535 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

## బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాలి : సీఎండీ

శ్రీరాంపూర్, మే 3 : ఈ ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తికి పూర్తిగా అనుకూలంగా ఉండే మొదటి త్రైమాసిక కాలాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటూ 160 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని, 1200 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం ఏరియాల జనరల్ మేనేజర్లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి అన్ని ఏరియాల జీఎంలతో ఏర్పాటు చేసిన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశంలో సీఎండీ మాట్లాడారు. ఉత్పత్తి, బొగ్గు రవాణా తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు, జీఎంలు, అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.

## బీసీలకు అన్యాయం చేసిన కాంగ్రెస్ : బీఎస్పీ

మందమర్రి, మే 3: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసిందని, ప్రభుత్వం పూర్తయ్యిందని చెబుతున్న కుల గణన తప్పుతడకగా మార్చి బీసీ సంఖ్యను తక్కువ చేసి చూపించారని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) కేంద్ర కోఆర్డినేటర్ నిషాని రాంచందర్ ఆరోపించారు. మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 75 ఏండ్ల కాలంలో ఏనాడు కులగణన చేయలేదన్నారు. మంచిర్యాల జిల్లాలో అభివృద్ధి మచ్చుకైనా కానరావడం లేదని జిల్లా అభివృద్ధి కోసం బీఎస్పీ పోరాడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో బీఎస్పీ జోనల్ కోఆర్డినేటర్ కాదాసి రవీందర్, జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు గాజుల శంకర్, మండల అధ్యక్షుడు దుర్గం రాజశేఖర్, కృష్ణ, నారాయణ, జోసెఫ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కరించాలి

- ఆదిల్‌పేట్ గ్రామస్తుల ఆందోళన



ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు

మందమర్రిరూరల్, మే 3 : తాగు నీటి సమస్య పరిష్కరించాలని ఆదిల్‌పేటలోని ఒకటో వార్డు మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మహిళలు మాట్లాడుతూ రెండు నెలలుగా కాలనీకి తాగునీరు సరఫరా కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సుదూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు కాంట్రాక్టర్లు తాగునీరు సరఫరా చేస్తున్న పైపులైన్లు తవ్వడంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. వెంటనే పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని గ్రామ స్పెషల్ ఆఫీసర్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇకనైనా అధికారులు స్పందించి తాగునీరందేలా చూడాలని కోరారు. అనంతరం కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ గిరిధర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ భార్గవికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బొక్కల భవానీ, దేవమ్మ, భారతి, లక్ష్మి, బొర్ల కుంట మధులత, మల్లేపల్లి, రాజక్క, విజయ పాల్గొన్నారు.

## కోర్టు భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

బెల్లంపల్లి, మే 3: బెల్లంపల్లి మండల శివారులో నూతనంగా నిర్మిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా న్యాయమూర్తి వీరయ్య, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి డి.రామ్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆ భవన నిర్మాణ పనులను వారు పరిశీలించారు. నిర్మాణ పనులపై ఆర్అండ్‌బీ విభాగం అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ముఖేశ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## మురుగు కాలువ ధ్వంసం



ముత్యంపల్లిలో ధ్వంసమైన మురుగుకాలువ

కాసిపేట, మే 3 : కాసిపేట మండలంలోని ముత్యంపల్లిలో ప్రభుత్వ నిధులతో నిర్మించిని మురుగు కాలువను ధ్వంసం చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముత్యంపల్లి హనుమాన్ టెంపుల్ నుంచి గ్రామాన్ని కలుపుతూ వాగు వరకు మురుగు కాలువను ప్రభుత్వం నిధులతో నిర్మించారు. వరద నీరు ఇండ్లల్లోకి వెళ్లకుండా వాగు వరకు మురుగుకాలువను నిర్మించారు. షాపుల కోసం షెటర్లను నిర్మించేందుకు జేసీబీతో కాలువ మీద నుంచి పాత గోడలు కూల్చడం కోసం కాలువను ధ్వంసం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువను తిరిగించాలని స్థానికులు కోరగా స్పందించడం లేదని తెలిపారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

## గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ మైనార్టీ నాయకుడి నిరసన



నిరసన తెలుపుతున్న మైనార్టీ నాయకుడు గౌస్

బెల్లంపల్లి, మే 3: పట్టణ కాంగ్రెస్ కార్యాలయ గాంధీ విగ్రహం ముందు పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు శనివారం నిరసన తెలిపాడు. పట్టణ అధ్యక్షుడు మల్లయ్య తనపై అక్రమ కేసు పెట్టించారంటూ ఆయన నిరసన చేపట్టారు. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎండీ గౌస్ తనపై కేసు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ పత్రంతో విగ్రహం వద్ద ఆందోళనకు దిగడం చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఫ్లెక్సీని కాంగ్రెస్ కార్యాలయంలో ఉండగా కొద్ది రోజుల క్రితం ఫ్లెక్సీని తొలగించారన్నారు. ఈ విషయంపై తాను పట్టణ అధ్యక్షుడు మల్లయ్యను అడిగినట్లు తెలిపారు. ఈ విషయంపై మల్లయ్య వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేశారని ఆరోపించారు. తనపై పోలీస్‌స్టేషన్‌లో పెట్టించిన అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

## వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కలెక్టర్‌కు పూల మొక్క అందజేస్తున్న విద్యార్థులు

సీసీసీ నస్పూర్, మే 3: వేసవి సెలవుల్లో విజ్ఞానంతో పాటు వినోదాన్ని అందిస్తూ పాఠ్య, పాఠ్యేతర అంశాలను అందిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ కోరారు. శనివారం నస్పూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి బాలికల వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, స్పీడ్ మ్యాథ్స్, డ్యాన్స్, మ్యూజిక్, యోగా, మెడిటేషన్, కంప్యూటర్ కోడింగ్, పెయింటింగ్ తదితర అంశాలపై ఈ నెల 17వ తేదీ వరకు శిక్షణ అందిస్తారని తెలిపారు. ప్రతిరోజూ కొత్త విషయాలు నేర్చుకోవాలన్నారు. క్రీడలు, సంగీతం, చిత్రలేఖనం, తదితర రంగాల్లో రాణిస్తే ఏకాగ్రత పెగుతుందని, ఇష్టంతో నేర్చుకుంటే నైపుణ్యత సాధించవచ్చన్నారు. క్రమశిక్షణ, చిత్తశుద్ధి ఉంటే ఎంచుకున్న లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణమూర్తి, నస్పూర్ ఎంఈవో దామోదర్‌రావు, నస్పూర్ కేజీబీవీ ప్రత్యేకాధికారి మౌనిక పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రుల పర్యటనకు ఏర్పాట్లు చేయాలి

ఆసిఫాబాద్ టౌన్ మే 3: జిల్లాలో ఈ నెల 5న కేంద్ర మంత్రుల పర్యటన నేపథ్యంలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఏఎస్పీ ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ తో కలిసి కేంద్ర మంత్రుల పర్యటన, ఏర్పాట్లపై పోలీస్, రెవెన్యూ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 4 వరుసల జాతీయ రహదారి – 363 ను ఈ నెల 5న కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఇతర కేంద్ర మంత్రులతో కలిసి ప్రారంభిస్తారని తెలిపారు. కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్ సమీపంలో హెలిప్యాడ్, బహిరంగ సభ సంబంధించి పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**సభ ఏర్పాట్ల పరిశీలన**

రెబ్బెన, మే 3: రెబ్బెన మండలం కాగజ్‌నగర్ క్రాస్ రోడ్‌లో బహిరంగ సభస్థలం, హెలిప్యాడ్ ప్రాంతాలను శనివారం సాయంత్రం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, సబ్ డివిజన్ ఏఎస్పీ చిత్తరంజన్, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావులు పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీడీ అజయ్ మణికుమార్, సీఐ బుద్దే స్వామి, ఎస్ఐ చంద్రశేఖర్, ఈవెంట్ మేనేజర్ అనూప్ తదితరులున్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 3: జిల్లాలోని తిర్యాణి ఆస్పిరేషన్ బ్లాక్ లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో తిర్యాణి ఆస్పిరేషన్ బ్లాక్ లో 38 అంశాలపై జిల్లా శిశు సంక్షేమ, వైద్య, విద్య, పశుసంవర్ధక, వ్యవసాయ, టి ఫైబర్, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2 సంవత్సరాల నుంచి తిర్యాణి ఆస్పిరేషన్ బ్లాక్ లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా 38 అంశాలపై అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేశ్, అదనపు డీఆర్డీవో రామకృష్ణ, తిర్యాణి ఎంపీడీవో మల్లేశ్, విద్య, వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చదువుల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

కెరమెరి, మే 3: విద్యార్థులు చదువుల్లో మంచి ప్రతిభను కనబరుస్తేనే ఉత్తమ భవిష్యత్ ఉంటుందని గోండ్వాన పంచాయతీ రాయి సెంటర్ సార్మేడి పెందోర్ రాజేశ్వర్‌రావ్ అన్నారు. శనివారం మండలంలోని జోడేఘాట్ గ్రామంలో రాయిసెంటర్ ఆధ్వర్యంలో పదవ తరగతిలో ఉత్తీర్ణులైన వారికి శాలువాతో సన్మానించి అభినందించారు. కుమ్రం భీం పోరాట గడ్డలో ఆ నాడు తుపాకీతో పోరాడిన గ్రామం నేడు అక్షర సాధన కోసం పరితపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసార్మేడి ఆత్రం ధర్ము, గిత్తేదార్ ఆత్రం సోనేరావు, గట్యాల్ కుమ్రం మారుతి, పెందూర్ కేశవరావు పటేల్, కారోబార్ రాంషావ్, జంగుబాయి, సాక్కుబాయి, లక్ష్మణ్, సాయిరాం, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

దహెగాం, మే 3: మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దాల దేవయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కలిపించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లనే వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కోండ్ర తిరుపతిగౌడ్, వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ్, డీసీవో వినోద్‌కుమార్, ఏవో రామకృష్ణ, కార్యదర్శి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు సహకరించాలి

బెజ్జూర్, మే 3 : మండల కేంద్రంలో కిరాణా దుకాణా సముదాయాల్లో చోరీలను అరికట్టేందుకు వ్యాపారులు సహకరించాలని ఎస్ఐ ప్రవీణ్ అన్నారు. శనివారం బెజ్జూర్ మండల కేంద్రంలో అవగాహన కల్పించారు. చోరీల నివారణకు ముందు జాగ్రత్తగా ప్రతి షాపులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందుకు వ్యాపారులు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కనికుట్ల శ్రీనివాస్, బోగ మురళీధర్, బోగ రమేశ్, జిల్లాల సుధాకర్ గౌడ్, రాచకొండ స్వప్నిల్, చాకటి శ్రీధర్, బోగ ప్రశాంత్, మేరాజ్, సామల వెంకటేశ్, మద్దెర్ల వెంకన్న లెక్కల శంకర్, సర్కార్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు

## మహిళలు, చిన్నపిల్లల రక్షణకు ప్రాధాన్యం

ఆసిఫాబాద్ టౌన్, మే 3: జిల్లాలో మహిళలు చిన్నపిల్లల రక్షణే పోలీసుల మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎస్పీ డీవీ శ్రీనివాస రావు శనివారం తెలిపారు. ఇందుకోసం షీ టీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్, భరోసా సెంటర్లు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్‌లో షీ టీం ద్వారా 91 హాట్ స్పాట్ ప్రదేశాలను గుర్తించి 23 అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశామని 7 ఫిర్యాదుల్లో 3 ఎఫ్ఐఆర్ నమోదు చేసి మిగతా వారికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసిఫాబాద్ సబ్ డివిజన్ షీ టీం నంబర్ 8712670564, కాగజ్‌నగర్ 8712670565 ను సంప్రదించాలని సూచించారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

కెరమెరి, మే 3 : వాహనదారులు మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మధుకర్ అన్నారు. శనివారం రహదారిపై వాహనాల తనిఖీ చేశారు. ఈ వాహనాలను తనిఖీ చేస్తూ పత్రాలను పరిశీలించారు. లైసెన్స్, వాహన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. నిర్లక్ష్యంగా ప్రమాదకరంగా నడుపుతున్న మహారాష్ట్రకు చెందిన వ్యక్తిని పరీక్షించగా మద్యం తాగినట్లు తేలింది. కేసు నమోదు చేసి బైక్ సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలి

రెబ్బెన, మే 3: త్వరలో జరిగే పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షల్లో ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించాలని సింగరేణి పాఠశాల కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి అన్నారు. సింగరేణి పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు, పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇంగ్లిష్ మీడియంలోని పదవ తరగతి విద్యార్థులు అందరు ఉత్తీర్ణత సాధించటం అభినందనీయమన్నారు. తెలుగు మీడియంలో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులందరికి ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సమావేశంలో డీవైపీఎం వేణు, హెచ్ఎం రవితేజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సమ్మె నోటీస్ అందజేత

రెబ్బెన, మే 3: కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకులంగా మారుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 20న జరిగే సమ్మె కు సంబంధించిన నోటీస్‌ను శనివారం గోలేటి జీఎం కార్యాలయంలో ఇన్‌చార్జి జీఎం మచ్చగిరి నరేందర్‌కు జేఏసీ ఆధ్వర్యంలో అందించినట్లు తెలంగాణ బొగ్గు గని కాంట్రాక్టు కార్మిక సంఘం(టీబీజీకేఎస్ అనుబంధం) ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు, సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కాంట్రాక్టు కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి ధనరాజ్, కార్యదర్శి గోపాల్, ప్రభాకర్, సిఐటియు కాంట్రాక్టు కార్మిక సంఘం ఏరియా అధ్యక్షురాలు రాపల్లి శారద, అనిత లతో పాటు పలువురు ఉన్నారు.